క్లుప్తంగా

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు



కార్యక్రమంలో పాల్గొన్న వైద్య సిబ్బంది, స్థానికులు

అల్లిపురం: కొబ్బరితోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో చిన్నారులకు వెంకటేశ్వరమెట్టపై వ్యాధి నిరోధక టీకాలు బుధవారం వేశారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు టీకాలు వేసి, మందులు అందజేశారు. ముఖ్యంగా చిన్నారులకు కోరింత దగ్గు, హెపటైటిస్ బి, పోలియో, డీపీటీ వంటి వ్యాధులకు టీకాలు వేశారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆశ వర్కర్లు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, జీఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

29వ వార్డులో మహాన్నదానం



అన్నదానం ప్రారంభిస్తున్న పీతల వాసు తదితరులు

డాబాగార్డెన్స్: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 29వ వార్డు రామజోగిపేటలో రామ్ అండ్ రామ్ జడ్పీ యూత్ ఆధ్వర్యంలో బుధవారం మహాన్నదానం ఏర్పాటు చేశారు. ముందుగా వైఎస్సార్ సీపీ 29వ వార్డు నాయకుడు పీతల వాసు వినాయకునికి పూజలు చేశారు. అనంతరం మహాన్నదానం ప్రారంభించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు కిరణ్, ఉరిమిటి శివపండు, వద్దాది రాజు, ఒమ్మి విశ్వేశ్వరరావు, మణి తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు ఉచితంగా క్షవరం



వసతిగృహంలో నిరాశ్రయులకు క్షవరం చేస్తున్న నాయీబ్రాహ్మణులు

సీతమ్మధార: మానవ సేవే మాధవ సేవ అన్న సిద్ధాంతంతో కంచరపాలెం ప్రాంతానికి చెందిన నాయీబ్రాహ్మణుల సంఘం సభ్యులు నిరాశ్రయులకు ఉచితంగా క్షవరం చేస్తున్నారు. ఇందులో భాగంగా ద్వారకానగర్ టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో గల జీవీఎంసీ – ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహంలో గల వారికి బుధవారం ఉచితంగా క్షవరాలు చేశారు. ఇక్కడ వున్న వృద్ధులు, మానసిక రోగులకు క్షవరాలు చేసి సేవాభావం చాటుకున్నారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులకు ఏయూటీడీ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు ధన్యవాదాలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భార్యా భర్తలకు గాయాలు

కొత్తవలస: మండలంలోని అరకు–విశాఖ జాతీయ రహదారిలో నిమ్మలపాలెం జంక్షన్ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు తీవ్ర గాయాల పాలయ్యారు. ఈ ప్రమాదానికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నానికి చెందిన భార్యాభర్తలు ద్విచక్ర వాహనంపై ఎస్.కోట నుంచి విశాఖ వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో భార్యాభర్తలు తుళ్లిపోయి పక్కనే ఉన్న గోతిలో పడిపోయారు. ఈ ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే వారికి సపర్యలు చేశారు. కాగా మహిళా ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో అపస్మారక స్థితికి చేరుకుంది. భార్యాభర్తలను వైద్యం నిమిత్తం విశాఖపట్నం తరలించారు. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని సీఐ షణ్ముఖరావు తెలిపారు.

ఉద్యానవనం.. దయనీయం



అస్తవ్యస్తంగా పార్కు లోపలి భాగం

- నిరుపయోగంగా రామకృష్ణా జంక్షన్ పార్కు
- అసాంఘిక కార్యకలాపాలకు నిలయం

అల్లిపురం: రామకృష్ణా జంక్షన్‌లో పార్కు నిరుపయోగంగా మారింది. విశాలమైన స్థలం ఉన్నా అధికారులు సీతకన్ను వేయడంతో అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో ఈ ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా తయారైంది. నగర ప్రజల ఆరోగ్యం కోసం నగరంలోని అన్ని వార్డుల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసిన జీవీఎంసీ ఈ పార్కును మాత్రం విస్మరించిందని 34వ వార్డు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్కును అభివృద్ధి చేసి, వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేస్తే తమకు ఉపయోగకరంగా ఉంటుందని యువత కోరుతున్నారు.

రైతులను తరలించి..

గతంలో ఈ పార్కు ప్రాంతంలో రైతులు దూర ప్రాంతాల నుంచి వచ్చి కాయగూరలు అమ్మేవారు. వారికి ప్రత్యేకంగా మార్కెట్ కట్టించి తరలించారు.



పార్కు ముఖద్వారం ఇలా..

అప్పటి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆదేశాల మేరకు రైతులకు స్టాల్స్ కేటాయించారు.

ఆకతాయిలకు అడ్డాగా..

ఈ ప్రాంతంలో పార్కు నిర్మిస్తామని చెప్పి చుట్టూ కంచె వేసి, సిమెంట్ బెంచీలు మాత్రం ఏర్పాటు చేసి వదిలేశారు. కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఈ పార్కు ఆదరణకు నోచుకోలేదు. దీంతో గంజాయి సేవించేవారు దీనిని అడ్డాగా మార్చుకున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా మద్యం, గంజాయి విచ్చలవిడిగా వినియోగిస్తూ ఆకతాయిలు స్థానికులకు భయాందోళనకు గురిచేస్తున్నారు. మరోవైపు పార్కులోనే గేదెలను కట్టడంతో అటుపక్కకు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

జిమ్ సామగ్రి ఏర్పాటు చేస్తే..

పార్కు స్థలంలో జీవీఎంసీ అధికారులు ఆధునిక జిమ్ ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నగరంలోని పలు పార్కుల్లో ఆధునిక జిమ్ సౌకర్యాలు ఏర్పాటు చేసి, పేదలుండే ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయకపోవడమేంటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి, పార్కును అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

ఆకతాయిల ఆగడాలతో ఇబ్బంది



పార్కులో ఆకతాయిలు మత్తు పదార్థాలు సేవిస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఈ స్థలాన్ని అభివృద్ధి చేసి, జిమ్ పరికరాలు ఏర్పాటు చేస్తే ఎంతోమందికి ఉపయోగం. జీవీఎంసీ అధికారులు దృష్టి సారించాలి.

– పిల్లి సత్తిబాబు, ఉపాధ్యక్షుడు, శెట్టి బలిజ సంక్షేమ సేవా సంఘం

స్లమ్‌లో యువతకు ఉపయోగం



రామకృష్ణా పార్కులో జిమ్ సామగ్రి ఏర్పాటు చేస్తే స్లమ్‌లో యువతకు ఉపయోగంగా ఉంటుంది. కొబ్బరితోట, నేతాజీనగర్ ప్రాంతాల్లో ఉండేవారు జిమ్ చేసుకోవాలంటే వేలాది రూపాయలు వెచ్చించాల్సి వస్తోంది. అఫీషియల్ కాలనీల్లో యువతకు జిమ్‌లు ఏర్పాటు చేసి, మురికివాడల్లో ఉన్నవారికి ఆ అవకాశం కల్పించకపోవడం బాధాకరం. జీవీఎంసీ అధికారులు పరిశీలించి జిమ్ సామగ్రి ఏర్పాటు చేయాలి.

– కె.కనకరాజు, కొబ్బరితోట

ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలి



పార్కుతో పాటు కొబ్బరితోటలోనూ కొన్ని ప్రభుత్వ స్థలాలు ఉన్నాయి. వాటిలో కూడా జిమ్ సామగ్రి ఏర్పాటు చేసినట్లయితే ఇక్కడివారు ఉపయోగించుకుంటారు. ఓపెన్ జిమ్‌లు అందరికీ అవసరం. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

– దూడ అప్పారావు, కొబ్బరితోట

కూలేందుకు సిద్ధంగా వంతెన పైభాగం

కంచరపాలెం: జ్ఞానాపురం పరిధి కాన్వెంట్ కూడలిలో వంతెన పైభాగం కూలేందుకు సిద్ధంగా ఉండడంతో వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. కాన్వెంట్ జంక్షన్ నుంచి పారిశ్రామిక ప్రాంతానికి వెళ్లే పురాతన వంతెన రహదారిలో రైల్వే ట్రాక్ ప్రాంతంలో వంతెనకు ఇరువైపులా నిర్మించిన సిమెంటు కట్టడాలు శిథిలావస్థకు చేరాయి. ఎస్సార్ కంపెనీ వద్ద గల కట్టడమైతే ప్రస్తుతం కూలేందుకు సిద్ధంగా ఉంది. భారీ వాహనాలు వెళ్లే సమయంలో రాళ్లు వంతెనపై పడుతున్నాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు రాకపోకలు సాగించేందుకు భయాందోళన చెందుతున్నారు. వాహనాల రాకపోకలు సాగించే సమయంలో బ్రిడ్జి పడిపోయే స్థితిలో ఉందని చెబుతున్నా అధికారులు స్పందించడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. సంబంధిత అధికారులకు, స్థానిక ఎమ్మెల్యేకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవడంతో... ప్రాణాలు పోతే స్పందిస్తారా..? అంటూ శిథిలావస్థకు చేరిన వంతెన వీడియోలు తీసి వాట్సాప్ గ్రూప్‌లలో స్థానికులు షేర్ చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.



కాన్వెంట్ జంక్షన్‌లో శిథిలమై ప్రమాదకరంగా మారిన వంతెన పైభాగం

వరద బాధితులకు సహాయం



వరద బాధితులకు రగ్గులు, టవల్స్ అందజేస్తున్న హిమ హ్యుమానిటేరియన్ సంస్థ ప్రతినిధి దాస్

డాబాగార్డెన్స్: విజయవాడ వరద బాధితులకు తమ వంతు సాయంగా ఒడిశా స్టీవ్‌డోర్స్, సింహాద్రి టీఎంటీ, హిమ హ్యుమానిటేరియన్ స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా రగ్గులు, టవల్స్, బ్రెడ్స్, వాటర్ బాటిళ్లను అందజేశారు. వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయిన ప్రజలు తిరిగి సాధారణ స్థితికి చేరుకోవాలని ఆయా సంస్థల ప్రతినిధులు కోరారు. కష్టకాలంలో తోటివారికి సహాయపడడంలో ఆత్మ సంతృప్తి ఉంటుందని తెలిపారు. సహాయక కార్యక్రమాల్లో హిమా హ్యూమానిటేరియన్ అసోసియేషన్ ప్రతినిధులు టీవీడీ దాస్, కె.ప్రభాత్‌కుమార్, ఎం.కాశీవిశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ కార్యాలయంలో అన్నసమారాధన

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఉద్యోగులు ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద బుధవారం అన్నసమారాధన నిర్వహించారు. అన్నసమారాధనను ప్రారంభించిన జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి మాట్లాడుతూ గణేశుని ఆశీస్సులు అందరికీ లభించాలని ఆకాంక్షించారు. ఉద్యోగులందరూ అన్న సమారాధన చేపట్టడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమం నిర్వహించిన జీవీఎంసీ ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ ఎంవీడీ ఫణిరామ్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా జీవీఎంసీ ఉద్యోగులు కలిసి వినాయక చవితి పండగ ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అనంతరం ఉద్యోగులు గరిడీ, కోలాటం మధ్య నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జీవీఎంసీ డీసీఆర్ శ్రీనివాసరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆదినారాయణ, పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



అన్నసమారాధన ప్రారంభిస్తున్న జీవీఎంసీ అదనపు కమిషనర్ రమణమూర్తి

గణనాథుడికి ఘనంగా గరిక పూజ



గరిక పూజలో పాల్గొన్న మహిళలు, చిన్నారులు



గణపతి సన్నిధిలో వైఎస్సార్ సీపీ నాయకులు కోలా గురువులు, ద్రోణంరాజు శ్రీవత్సవ్

అల్లిపురం: వెంకటేశ్వరమెట్టపై డీజే బాయ్స్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. వేడుకల్లో భాగంగా బుధవారం రాత్రి గరిక పూజ నిర్వహించారు. మహిళలు, చిన్నారులు పాల్గొని మట్టి గణపతిని గరికతో అర్చించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, పార్టీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్, బొడ్డేటి ప్రసాద్ తదితరులు పాల్గొని గణపతికి పూజలు చేశారు. వారిని నిర్వాహకులు సత్కరించి గణపతి ప్రసాదం అందజేశారు.

ఘనంగా గణపతి హోమం

అల్లిపురం: స్థానిక శ్రీ గణపతి నీలమాంబ యూత్ అసోసియేషన్, జీకే ఫౌండేషన్ సంయుక్తంగా వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం మండపం వద్ద గణపతి హోమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వరద రాజకీయాలు దేనికి?

- చేతనైతే బాధితులకు సాయం చేయండి
- గిరిజన శాఖ మంత్రి సంధ్యారాణికి జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర కౌంటర్



మహారాణిపేట: ప్రభుత్వంలో ఉన్నవారు ప్రజలకు కష్టం వచ్చినప్పుడు ఓదార్చి ఆదుకోవడం అనేది బాధ్యత అని, కానీ రాష్ట్రంలో కూటమి నేతలు బాధ్యతలను విస్మరించి వరద రాజకీయాలు చేస్తున్నారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర విమర్శించారు. గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి మంగళవారం చింతపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వంపై చేసిన విమర్శలు హాస్యాస్పదంగా ఉన్నాయని ఆమె కౌంటర్ ఇచ్చారు. విశాఖపట్నంలోని జెడ్పీ అతిథి గృహంలో సుభద్ర బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముందు చంద్రబాబు నాయుడు ఇచ్చిన స్క్రిప్ట్ చదవాలో.. వాస్తవాలను తెలియజేయాలో అర్థంకాక గిరిజన శాఖ మంత్రి ఏదేదో మాట్లాడుతున్నారని ఆమె అన్నారు. ఒకపక్క భారీ వర్షాల వల్ల వాగులు, వంకలు పెద్ద ఎత్తున ప్రవహించడంతో కల్వర్టులు, వంతెనలు, రహదారులు తీవ్ర స్థాయిలో దెబ్బతిన్నాయని మంత్రి చెప్పారని.. దీనికి జగన్‌మోహన్‌రెడ్డి కారణమని చెప్పడం ఎంతవరకు సమంజసమని ఆమె ప్రశ్నించారు. భారీ వర్షాల వల్ల జరిగిన నష్టాన్ని పూడ్చడం చేతగాక బాధ్యతల నుంచి తప్పించుకునేందుకు గత ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారన్నారు. గిరిజన సంక్షేమం, అభివృద్ధికి ఎవరు కృషి చేశారన్న విషయం ప్రజలకు తెలున్నారు. గిరిజన ప్రాంతాల్లో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదివాసీల అభివృద్ధికి, సంక్షేమానికి నిరంతరం కృషి చేశారని, అందువల్ల అరకు, పాడేరు నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ప్రజలు గెలిపించారన్నారు. రాష్ట్రంలో ఎక్కడ ఏం జరిగినా ఎక్కడ వరదొచ్చినా, ఎక్కడ వర్షాలు పడినా దానికి జగన్ ప్రభుత్వమే కారణమని కూటమి నేతలు చెప్పడాన్ని ఆమె తప్పుబట్టారు. వరదలకు జగన్ కారణమైతే గతంలో వచ్చిన కరోనాకు చంద్రబాబే కారణమా? అని నిలదీశారు.

మృతులకు రూ.కోటి పరిహారం ఇవ్వాలి

గాలికొండ పంచాయతీ చట్రాపల్లి గ్రామంలో కొండచరియలు విరిగిపడి మృతి చెందిన గిరిజన మహిళ కుమారి కుటుంబానికి కోటి రూపాయల పరిహారం అందించాలని, గాయపడ్డ ఒక్కొక్కరికి రూ.50 లక్షల చొప్పున సాయం చేయాలని ఈ సందర్భంగా సుభద్ర డిమాండ్ చేశారు. గిరిజనులపై ప్రేమ, అభిమానం నిజంగా కూటమి నేతలకు ఉంటే పరవాడలో బాధితులకు ఇచ్చిన విధంగా ఆర్థికంగా సాయం చేసి ఆదుకోవాలన్నారు. భారీ వర్షాల కారణంగా పాడేరు, అరకు, రంపచోడవరం నియోజకవర్గాల్లో భారీ ఎత్తున ఆస్తి నష్టం, పంట నష్టం జరిగిందని, ప్రజలకు ధైర్యం చెప్పడానికి అధికారులు, కూటమి నేతలు రాకపోవడం దురదృష్టకరమన్నారు.

రోడ్లపై ప్రైవేట్ ట్రావెల్ బస్సులు నిలపొద్దు

సీతమ్మధార: రోడ్ల మీద ప్రైవేట్ ట్రావెల్ బస్సులు పార్కింగ్ చేసి ట్రాఫిక్‌కి అంతరాయం కలిగించొద్దని ద్వారకా ట్రాఫిక్ సీఐ ప్రసాద్ కోరారు. ఈ మేరకు ప్రైవేట్ ట్రావెల్ బస్సుల నిర్వాహకులతో రామాటాకీస్ వద్ద బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రామాటాకీస్ నుంచి సత్యం జంక్షన్‌కి వెళ్లే మార్గంలో విశాఖ కంటి ఆస్పత్రి, తదితర ప్రాంతాల్లో ప్రైవేట్ ట్రావెల్ బస్సులు రోడ్డు మీద అధిక సమయం పార్కింగ్ చేసి వుంచడం వల్ల రెగ్యులర్ ట్రాఫిక్‌కి అంతరాయం కలుగుతోందన్నారు. ప్రయాణికులను సకాలంలో బస్సులు ఎక్కించుకుని త్వరితగతిన వెళ్లిపోయేలా నిర్వాహకులు చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే ఈ ప్రాంతంలో తరచూ గంజాయి, మద్యం అక్రమంగా రవాణా చేస్తూ నిందితులు దొరుకుతున్నందున బస్సు నిర్వాహకులు విధిగా ప్రయాణికుల లగేజీలు తనిఖీ చేయాల్సిన బాధ్యత వుందన్నారు. ఎవరి మీదైనా అనుమానం కలిగితే వెంటనే ద్వారకా పోలీసులకు సమాచారమివ్వాలని ఆయన సూచించారు. సమావేశంలో ద్వారకా ట్రాఫిక్ ఎస్ఐ భాస్కరరావు పాల్గొనినారు.



సమావేశంలో మాట్లాడుతున్న ద్వారకా సీఐ ప్రసాద్, చిత్రంలో ఎస్ఐ భాస్కరరావు

గ్రాఫిక్ డిజైనింగ్‌తో ఉపాధి అవకాశాలు



ప్రిన్సిపాల్ మంజులను సత్కరించిన జేసీఐ ప్రతినిధులు, తదితరులు

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. కళాశాల సైన్స్ విభాగం, జేసీఐ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థినులకు గ్రాఫిక్ డిజైనింగ్‌పై వివరిస్తూ, ఈ రంగంలో ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల తెలిపారు. గ్రాఫిక్ డిజైనింగ్‌లో అభివృద్ధి చెందుతున్న నూతన సాంకేతికతపై అవగాహన పెంచుకుని, తద్వారా నైపుణ్యాభివృద్ధి సాధించాలని విద్యార్థినులకు సూచించారు. 10 జి మైండ్స్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ఎండీ బలరాం వివిధ గ్రాఫిక్ డిజైనింగ్ సాఫ్ట్‌వేర్స్ గురించి వివరిస్తూ ఏఐ టూల్స్‌ను ఎలా ఉపయోగించాలో తెలిపారు. అనంతరం కళాశాల కంప్యూటర్ సైన్స్ అధ్యాపకురాలు డి.అరుణపద్మ గ్రాఫిక్ డిజైనింగ్ రంగంలో ఉపాధి అవకాశాలను తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మంజులను సత్కరించారు. కార్యక్రమంలో జేసీఐ విశాఖపట్నం సెనేటర్ చంద్రశేఖర్, సెక్రటరీ ఆర్.కార్తీక్, ప్రవీణ, కళాశాల ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ బి.సంతోషి, అనూష, ఫిజికల్ డైరెక్టర్ ఆర్.కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో ఎన్‌సీసీ ఎన్‌రోల్‌మెంట్

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ బెటాలియన్ నేతృత్వంలో బాలికల కోసం ప్రత్యేకంగా ఎన్‌రోల్‌మెంట్ బుధవారం నిర్వహించారు. సుబేదార్ మేజర్ బోర్డే, సుబేదార్ అమిత్‌సింగ్, నాయక్ హస్సేనయ్యా, పల్లవి కొత్త కేడెట్ల నమోదు నిర్వహించారు. ఎంపికలో భాగంగా కేడెట్లకు 500 మీటర్ల పరుగు, దృష్టి పరీక్ష, అవయవాల కదలిక పరీక్ష, బాడీ మాస్ ఇండెక్స్ మూల్యాంకనం, రాత పరీక్ష, వ్యక్తిగత ఇంటర్వ్యూల ఆధారంగా ఎంపిక చేశారు. కళాశాల నుంచి 103 మంది బాలికలు పాల్గొనగా వీరిలో 22 మంది ఎంపికయ్యారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.కిరణ్మయి, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ కె.గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన కేడెట్స్‌తో ఎన్‌సీసీ అధికారులు, కళాశాల ప్రిన్సిపాల్ మంజుల తదితరులు

ఏఎంసీకి అప్పారావు భౌతికకాయం

ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి నేత్రాలు దానం



మరడాన అప్పారావు (ఫైల్)

మహారాణిపేట: తాను లేకున్నా తన శరీరం, కళ్లు ఇతరులకు ఉపయోగపడాలన్న ఆ పెద్దాయన సంకల్పాన్ని కుటుంబ సభ్యులు గౌరవించారు. ఆయన కోరిక మేరకు కళ్లను ఎల్.వి.ప్రసాద్ కంటి ఆస్పత్రికి, భౌతిక కాయాన్ని ఆంధ్ర మెడికల్ కళాశాలకు దానం చేశారు. వివరాలివి.. పురుషోత్తపురంలోని కంఫర్ట్ హోమ్స్‌లో నివాసం ఉంటున్న మరడాన అప్పారావు (89) సేవా భావంతో ఉండేవారు. 2019లో సావిత్రి బాయి పూలే చారిటబుల్ ట్రస్ట్ ద్వారా శరీర దానానికి అంగీకార పత్రం అందజేశారు. ఆయన కుమారుడు ఎన్ఎస్‌టీఎల్ ఉద్యోగి అయిన చంద్రశేఖర్‌తో పాటు, కోడలు, ముగ్గురు కుమార్తెలు కూడా శరీర, అవయవ దానాలు చేసేలా ప్రోత్సహించారు. స్నేహితులను, చుట్టుపక్కల వారికి కూడా దేహదానం, అవయవదానంపై అవగాహన కల్పించేవారు. అనారోగ్య కారణాలతో అప్పారావు మంగళవారం తుదిశ్వాస విడవడంతో ట్రస్ట్ సహకారంతో ఆయన కుటుంబ సభ్యులు శరీర, నేత్రదానం చేశారు. శరీరదాత అప్పారావుకు సావిత్రబాయి పూలే ట్రస్ట్ చైర్‌పర్సన్ సీతామహాలక్ష్మి ప్రకటనలో జోహార్లర్పించారు.



అప్పారావు భౌతిక కాయాన్ని ఏఎంసీకి అందజేస్తున్న కుటుంబ సభ్యులు

అధ్వానంగా జోనల్ కార్యాలయం

- ఎక్కడికక్కడ పేరుకుపోయిన చెత్త
- ఆవరణలోనే పాత సామగ్రి

జగదాంబ: జోన్–4 కార్యాలయంలో అపరిశుభ్రత నెలకొనడంతో వివిధ పనులపై అక్కడికి వచ్చే ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఉండే కార్యాలయాలే ఇలా ఉంటే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. ఇటీవల జీవీఎంసీ జోనల్ కార్యాలయాలను అభివృద్ధి చేసింది. ఈ క్రమంలో జోన్–4 కార్యాలయాన్ని కూడా అభివృద్ధి చేశారు. అయితే, ఆ సమయంలో వేరు చేసిన ఫర్నిచర్, ఇతర సామగ్రి అంతా కార్యాలయం వద్దనే వదిలేశారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆ ప్రాంతమంతా చిత్తడిగా మారడంతో పాటు దోమలకు నిలయంగా తయారైంది. ఇప్పటికైనా కార్యాలయం వద్ద శుభ్రతపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జనరేటర్లు మాయం

జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో మరమ్మతుల నేపథ్యంలో జనరేటర్లు మాయం అయినట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు. గతంలో కార్యాలయ పనుల నిమిత్తం నాలుగు జనరేటర్లు ఏర్పాటు చేశారు. తర్వాతి కాలంలో పాత వాటిని పక్కన పెట్టి, కొత్త జనరేటర్ కొనుగోలు చేశారు. దీంతో పాతవి కార్యాలయంలోనే ఓ పక్కన పెట్టి ఉంచారు. అయితే కార్యాలయం మరమ్మతుల నేపథ్యంలో వాటిని మాయం చేసినట్లు ఆరోపిస్తున్నారు. జోనల్ కార్యాలయానికి సంబంధించిన వస్తువులు అనుమతి లేకుండా ఎలా తీసుకువెళ్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీనిపై అధికారులు విచారణ చేయించాలని కోరుతున్నారు.



జోనల్ కార్యాలయం వద్ద వదిలేసిన సామగ్రి



కార్యాలయంలో పేరుకున్న చెత్త

కేజీహెచ్‌లో పెరుగుతున్న ఓపీ

మహారాణిపేట: కేజీహెచ్‌కు వచ్చే రోగులకు ఉత్తమ సంరక్షణ, చికిత్స అందిస్తున్నామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపారు. అవుట్ పేషెంట్ (ఓపీ) సంఖ్య పెరుగుతోందని, రోజుకు 2500 నుంచి 2700 మంది పాతరోగులు, కొత్త రోగులు చికిత్స కోసం వస్తున్నట్లు పేర్కొన్నారు. రోగుల సౌలభ్యం కోసం గైనిక్, పీడియాట్రిక్, ఆర్థోపెడిక్, డెర్మటాలజీ, కార్డియాలజీ, ఇతర సూపర్ స్పెషాలిటీ విభాగాల ఓపీ సేవలను ఆయా బ్లాకుల్లోనే కాకుండా వారి విభాగాల్లోనూ అందిస్తున్నారని తెలిపారు. రోగులు గమనించాలని కోరారు.